క్లుప్తంగా

బీఎల్‌వోలకు మెటీరియల్ అందజేత



గురజాల : బూత్ లెవల్ ఆఫీసర్‌లకు శుక్రవారం మెటీరియల్‌ను తహసీల్దార్ కె.నగేష్ అందజేశారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఓటర్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి బూత్‌లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం బీఎల్‌వోలకు క్యాప్, టీ–షర్ట్, బ్యాడ్జి తదితర వస్తువులతో కూడిన మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వైవీఎస్ శివన్నారాయణ రావు తదితరులున్నారు.

నిత్యావసరాలు అందజేత

గురజాల : స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు శుక్రవారం అందజేశారు. మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన కావూరి రామారావు కుమారుడు వైభవ్ పుట్టినరోజు పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో పోటు నాగేశ్వరరావు, దైద మేజర్ నీటి సంఘాల అధ్యక్షుడు జంపాని అమర లింగారావు, సొసైటీ మాజీ డైరెక్టర్ తవిటి నాగేశ్వరరావు, మాజీ వార్డు మెంబర్ పాముల రత్నబాబు, లేళ్ల సాంబశివరావు, జగదీష్, జానకీరామ్, ఆశ్రమ నిర్వాహకుడు చింతకాయల ఏసయ్య తదితరులున్నారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు



మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పలు ఎరువుల దుకాణాలపై శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలోని శ్రీవీరాంజనేయ ట్రేడర్స్‌లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, ఓ–ఫారం లేకుండా నిల్వ ఉంచిన రూ.1.8 లక్షల ఎరువులు, రూ.1.4 లక్షల విలువైన పురుగు మందులను గుర్తించి, డీలర్‌పై 6–ఏ కేసు నమోదు చేసినట్లు ఏఓ కె.రామమ్మ తెలిపారు. ప్రభుత్వ నియమ, నిబంధనలను అనుసరించి దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ సి.శివాజీ, విజిలెన్స్ వ్యవసాయ అధికారి సీహెచ్ ఆదినారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ–1గా జఫ్రుల్లా ఖాన్ బాధ్యతల స్వీకరణ



మాచర్ల రూరల్: మాచర్ల మండల విద్యాశాఖాధికారి–1గా షేక్ జఫ్రుల్లా ఖాన్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన వినుకొండ ఎంఈఓ–1 గా పనిచేస్తూ ఇన్‌చార్జిగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎంఈఓ–1 కాంతారావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 అల్లి సురేష్, ఉపాధ్యాయ సంఘ నాయకులు జి.గంగాధర్ బాబు, రాజశేఖర్, డేవిడ్ విల్సన్, ఫ్రాంక్లిన్, ఎక్సమస్ జాన్, కృష్ణారావు, రామారావు, కేశవరెడ్డి, ప్రైవేటు కాన్వెంట్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కెవి రమణ, శ్రీనివాసరావు, శాస్త్రి తదితరులు ఆయనను పూలమాలలు, శాలువతో సత్కరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మాచర్ల : పట్టణంలోని రూ.46 లక్షల వ్యయంతో గత 40 రోజులుగా డ్రైనేజ్ మరమ్మతుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మునిసిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో మాచర్ల రింగు రోడ్డు నుంచి గుంటూరు రోడ్డులోని నెహ్రూనగర్ వరకు అన్ని వార్డుల్లో డ్రైనేజ్ మరమ్మతు పనులు, కాలువల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం 15, 17, 18 వార్డుల్లో మరమ్మతుల పనులను చైర్మన్ పరిశీలించారు. యాగంటి మల్లిఖార్జునరావు, చందు గౌస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతల తహసీల్దార్‌గా అర్జున్‌నాయక్

రెంటచింతల: బొల్లాపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్ మూఢావత్ అర్జున్‌నాయక్‌ను పదోన్నతిపై రెంటచింతల తహసీల్దార్‌గా నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు గురజాల తహసీల్దార్ కె.నగేష్ రెంటచింతలకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలేనా...?

- 9 మండలాలకు రెండే కేంద్రాలు
- ప్రమాదాల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం
- వాహనం రావడానికి గంటల సమయం



పిడుగురాళ్లలోని అగ్నిమాపక యంత్రం



మాచర్లలోని అగ్నిమాపక కేంద్రం

గురజాల : రెవెన్యూ డివిజన్ పరిధిలో 9 మండలాలు కలవు. వీటి పరిధిలోని కేవలం మాచర్ల, పిడుగురాళ్ల మండలాల్లో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. 9 మండలాలకు 2 కేంద్రాలే ఉండటంతో గురజాల, కారంపూడి, రెంటచింతల తదితర ప్రాంతాలలో ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక వాహనం రావాలంటే గంటల కొద్దీ సమయం పడుతుంది. ఈ కేంద్రాల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. ఆయా ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో అగ్నిమాపక వాహనం రాకపోవడంతో దూరప్రాంతాల నుంచి వాహనం వచ్చేసరికి జరగాల్సిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుంది. గురజాల, కారంపూడి, రెంటచింతల మండలాల్లో అగ్ని ప్రమాదం జరిగితే మాచర్ల, పిడుగురాళ్ల నుంచి వాహనం రావాల్సిన పరిస్థితి.

వాహనం రావడానికి గంట సమయం

నియోజకవర్గ కేంద్రమైన గురజాలలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అటు మాచర్ల నియోజకవర్గ కేంద్రమైన మాచర్ల నుంచి గానీ, పిడుగురాళ్ల నుంచి గానీ మంటలను ఆర్పేందుకు వాహనం రావాల్సిన పరిస్థితి. గురజాలకు అటు మాచర్ల నుంచి దాదాపు 35 కిలోమీటర్లు, అలాగే ఇటు పిడుగురాళ్ల నుంచి అంతే దూరం ఉండడంతో అగ్నిమాపక వాహనం రావడానికి సుమారు గంట సమయం పడుతుంది. కావున గురజాలలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాలకు అనువుగా ఉంటుందని ప్రజల అభిప్రాయం.

ప్రజలే ఆర్పుకునే పరిస్థితి

గురజాల నియోజకవర్గంలో గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాలు, మాచర్ల నియోజకవర్గంలో మాచర్ల, దుర్గి, వెల్దుర్తి, రెంటచింతల, కారంపూడి మండలాలు ఉన్నాయి. మండలాల పరిధిలో 91 రెవెన్యూ గ్రామాలుండగా 140కి పైగా గ్రామ పంచాయతీలున్నాయి. పల్నాడు ప్రాంతంలో అధికంగా వరిగడ్డి వాములు, పశువుల కొట్టాలు, దుకాణాలు, పూరిల్లు వంటి వాటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తరచూ ప్రమాదాలకు గురవుతుంటాయి. ఈ ప్రమాదాలు జరిగిన ప్రతిసారి సకాలంలో అగ్నిమాపక వాహనం ప్రమాద ప్రదేశానికి చేరుకోలేకపోవడంతో ప్రజలే మంటలను బిందెలతో నీళ్లు పోసుకుని ఆర్పివేసిన ఘటనలు కోకల్లలు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరుగుతుంది.

హామీ తప్ప నెరవేర్చడం లేదు

ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల సమయంలో నాయకులు ఓట్లు కోసం గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో పలు మండలాల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప... వాటిని నెరవేర్చిన దాఖలాలు లేవు. అధికార పార్టీ నాయకులు, మంత్రులు తమ ప్రాంతాలకు వచ్చినప్పుడు అక్కడి ప్రజలు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అభ్యర్థించిన దాఖలాలు అనేకం. అయినప్పటికీ వారి కల మాత్రం నెరవేరడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయా మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుంది



అగ్రిమాపక కేంద్రం ఇటు పిడుగురాళ్ల, అటు మాచర్లలో మాత్రమే వుంది. రెండు ప్రాంతాల నుంచి వాహనం గురజాలకు రావాలంటే గంట సమయం పడుతుంది. గురజాలలో ఒక కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. గురజాలలో ఏర్పాటు చేయడం వలన అగ్ని ప్రమాదం జరిగితే నష్టం తక్కువగా జరిగే అవకాశం ఉంది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవ తీసుకుని గురజాలలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.

– షేక్ పీర్ అహ్మద్, గంగవరం

రెండు కల్లు విక్రయ షాపులకు మాత్రమే అనుమతి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో రెండు కల్లు విక్రయ షాపులకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు ఎక్సైజ్ సీఐ కె.కర్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలో ఒకటి, మాచవరం మండలంలో మరొకటి కల్లు షాపులకు అనుమతి ఇచ్చామని తెలిపారు. గౌడ సంఘ నాయకులకు ఈ షాపులకు సంబంధించి అనుమతులు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కారెంపూడి: డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి సమస్యలున్న ప్రజలు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన వారికి రాష్ట్రంలోని ఏదైనా బ్రాంచ్ హాస్పిటల్‌లో ఉచితంగా వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోడానికి కూపన్‌లను ఆసుపత్రి ప్రతినిధులు పంపిణీ చేశారు. ఎంఈఓ రవికుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు కిల్లా చెన్నయ్య తదితరులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

పులిపాడు గ్రామంలో పశు వైద్య శిబిరం

గురజాల రూరల్ : మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో పశు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, పశువులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సత్వరమే వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాలకు వైద్యులు వచ్చి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పులిపాడు గ్రామంలో వైద్య పరీక్షల కొరకు 45 మంది రైతులు పశువులను తీసుకువచ్చినట్లు వైద్యులు తెలిపారు. నట్టల నివారణకు పెద్ద పశువులు 245, దూడలు 20, మేకలు, గొర్రెలు నట్టల నివారణకు 300, బొబ్బ టీకాలు 250 మేకలు, గొర్రెలు, 10 పశువులకు చూడు పరీక్షలు, 2 పశువులకు ఎద ఇంజెక్షన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు.



పశు పోషకులకు మందులు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు

ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు టి.నాగమల్లేశ్వరరావు, కె.ఉమామహేశ్వరి, జె.నాగార్జున దీపక్, పంచాయతీ సెక్రటరీ సుబ్బారావు, వీఏ అనిల్‌కుమార్, దుర్గ, వీరాస్వామి, పూజ, వైష్ణవి, లక్ష్మీ, శ్రీనివాస్, గోపాలమిత్రలు జక్కా లక్ష్మీనారాయణ, కంచి తిరుపతయ్య, మద్దినేని లక్ష్మీనారాయణ, చిన్నం అమరలింగయ్య తదితరులున్నారు.

చర్చి వజ్రోత్సవ వేడుకలకు భద్రతా చర్యలు చేపట్టాలి

డీఎస్పీ జగదీష్

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని గురజాల డీఎస్పీ బి.జగదీష్ అన్నారు. శుక్రవారం ఆయన చర్చి ఆవరణలో జరుగుతున్న వేడుకల ఏర్పాట్లను పరిశీలించి చర్చి పెద్దలతో సమీక్షించారు. చర్చి ఆవరణలో పలుచోట్ల సీసీ కెమెరాలను కచ్చితంగా అమర్చాలని సూచించారు. భక్తులకు రక్షణగా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తిరునాళ్ల మహోత్సవానికి తరలివచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా పోలీసులకు సహకరించేందుకు వలంటీర్లను చర్చి పెద్దలు పెట్టాలని సూచించారు. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా పోలీసులతో పటిష్టమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం చర్చి పరిసరాలలో డ్రోన్ కెమెరాను ఎగురవేసి పరిశీలించారు. ఆయన వెంట కారంపూడి సీఐ టి.వి.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, చర్చి పెద్దలు తదితరులున్నారు.



ఐఎంఏ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యపై అవగాహన

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని దాచినేని సత్యన్నారాయణ మెమోరియల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నిరంతర వైద్య విద్య కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చందన పిల్లల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గొట్టిముక్కల శశిభూషణ్ హాజరై మాట్లాడుతూ నవజాత శిశువుల్లో స్క్రీనింగ్ ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఐఎంఏ భవిష్యత్ కార్యాచరణ, నిరంతరం చేయాల్సిన పనుల గురించి సభ్యులు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ పిడుగురాళ్ల శాఖ అధ్యక్షుడు డాక్టర్ దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ బొర్రా రాంప్రసాద్, డాక్టర్లు కేవీ సుబ్బారావు, అల్లా సాంబశివరావు, సీసీ సుబ్బారావు, రావిపాటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సునీల్ కుమార్, చింతలపూడి అశోక్‌కుమార్, వరలక్ష్మీ, శేషరావు పాల్గొన్నారు.



డాక్టర్ గొట్టిముక్కల శశిభూషణ్‌కు మెమెంటోను అందజేస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు


పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

ఎంఈఓ రవికుమార్

కారెంపూడి: పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎంఈఓ టి.రవికుమార్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం హెచ్‌ఎంల సమావేశాన్ని ఎంఈఓ నిర్వహించారు. పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలను తెలుపుతూ అలాగే ఉన్న పరిస్థితిని వివరిస్తూ పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను, గ్రామ విద్యా ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరుతూ అందుకు అవసరమైన మార్గదర్శకాలను ఎంఈఓ వివరించారు. ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను తెలుపుతూ ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. 60 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలకు ఐదుగురు టీచర్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ నేపథ్యంలో అవసరమైన డేటాను అందించాలన్నారు. ఇప్పుడున్న సౌకర్యాలు, కావాల్సిన వసతులు, టీచర్ల కొరత అలాగే ఎక్కువగా ఉంటే ఆ వివరాలను నమోదు చేయాలని ఎంఈఓ కోరారు. సమావేశంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



• మంచు తెర చాటున దాచేపల్లి



రహదారులు, రైల్వే ట్రాక్ వద్ద పొగమంచు శుక్రవారం ఉదయం కమ్మేసింది. ఉదయం 7 గంటల తరువాత మంచు తెరల చాటు నుంచి అప్పుడే సూర్యుడు ఉదయించాడు. విపరీతమైన మంచు కురుస్తుండటం వలన వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పట్టణంలో ఉదమం 8 గంటల వరకు పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. పొగమంచు కారణంగా రైళ్లు వేగం తగ్గించి, లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాయి. గత మూడు రోజులుగా పొగమంచు కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

– దాచేపల్లి

బాలలకు నాణ్యమైన విద్యను అందించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

పిడుగురాళ్ల: బాలలకు స్వేచ్ఛాయుత వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాలబాలికల హక్కులను పరిరక్షించాలని, వారి సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా ఉండాలన్నారు. నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. బాలబాలికలకు ఏదైనా సమస్య వస్తే 1098, 900112 నెంబర్లకు తెలియజేసి బాలల సంరక్షణతోపాటు వారి హక్కులను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, ప్రభుత్వ వైద్యులు అమరేశ్వర రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.ప్రసన్నకుమారి, ఎస్.నాగమణి, వెంకటలక్ష్మి, కోటేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

బాలికా విద్యతోనే అసమానతలు తొలగుతాయి

మాచర్ల రూరల్: సమాజంలో బాలికల హక్కులు, ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకొని సమాజంలో లింగ వివక్షతను తొలగించాలంటే బాలికల విద్యాభివృద్ధితోనే సాధ్యపడుతుందని పీహెచ్‌సీ వైద్యులు షేక్ ముక్తీయార్ జాని, ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో వారు మాట్లాడారు. విద్య ద్వారా వెనుకబాటుతనం, బాలికల విద్యతో అసమానతలు తొలగి ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. బాలికలు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఐవీ నాగమణి, ఏఎన్‌ఎంలు మరియమ్మ, చంద్రకళ, ఉపాధ్యాయులు ఉన్నారు.



7వ మైలు ఎంపీపీ పాఠశాలలో బాలికా దినోత్సవం

+ బాల్య వివాహాలు అరికట్టి విద్యాభివృద్ధికి బాటలు వేసిన నాడే బాలికల అభివృద్ధి సాధ్య పడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.లీలావతి అన్నారు. శుక్రవారం బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తాళ్లపలి, ఏడవ మైలు, జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, బాలికల విద్యకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాచర్ల జ్యోతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులున్నారు.

కేఎస్ఆర్‌లో జాతీయ బాలికా దినోత్సవం

పిడుగురాళ్ల: కేఎస్ఆర్ విద్యా సంస్థలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆడపిల్లలంటే భారం కాదు ఆడ పిల్లలంటే అదృష్టంగా భావించాలన్నారు. బాలికలు చదివినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే రోజుల్లో బాలికలు మరింతగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాదినేని నరసింహారావు, దీపంగి సురేష్, బి.యాకోబు, కోనేటి ప్రసన్న, షేక్ రజీయా, బి.ఇందు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొప్పునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలికల సాధికారతపై వివరిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు



మాట్లాడుతున్న కేఎస్ఆర్ డైరెక్టర్ కోనేటి నరసింహారావు

సేవల్లో రోటరీ క్లబ్ ముందు ఉంటుంది

డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి


పిడుగురాళ్ల: సేవలు చేయటానికి రోటరీ క్లబ్ ముందు ఉంటుందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి అన్నారు. పట్టణంలోని పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో 20 సభ్యులు నూతన క్లబ్‌ను ప్రారంభించారు. అలాగే బొగ్గవరపు సీతరామయ్య, డెఫ్ అండ్ డమ్ స్కూల్‌లో విద్యార్థులకు నాలుగు కంప్యూటర్లను అందజేశారు. వాసవీ కల్యాణ మండపంలో 10 మంది వికలాంగులకు వీల్ చైర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వచ్చిన రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్‌చౌదరి మాట్లాడుతూ పిడుగురాళ్ల రోటరీ క్లబ్ సేవల్లో ముందు ఉంటుందని, పిడుగురాళ్ల రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కె.రామకోటయ్య, అసిస్టెంట్ గవర్నర్ ఎం.సుమిత్ర కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌లు అందజేసిన రోటరీ క్లబ్ సభ్యులు

పీఎంజేజేబీవై చెక్కు అందజేత

విజయపురిసౌత్ : విజయపురిసౌత్‌కు చెందిన మంచికంటి శివపార్వతి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. ఆమెకు విజయపురిసౌత్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ ఉంది. గతంలో కేంద్ర ప్రభుత్వ బీమా అయిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) కింద సంవత్సరానికి రూ.436 చెల్లించింది. ఈ పథకం కింద ఖాతాదారులు ఎలాంటి మరణం చెందిన రూ.2 లక్షలు మృతుల కుటుంబానికి బ్యాంకు అందజేస్తుంది. ఈ బీమా చెల్లించి ఉండటం వలన ఆమె భర్త మంచికంటి బుద్ధారెడ్డికి ఎస్బీఐ మేనేజర్ ఫణీంద్ర కుమార్, బ్యాంకు సిబ్బంది చెక్కును శుక్రవారం అందజేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, జీవన సురక్ష బీమా యోజన ప్రతి ఒక్కరు కట్టుకొని అర్హత పొందాలని విజయపురిసౌత్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఇటీవల అనారోగ్యానికి గురై పిడుగురాళ్లలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన పెంటిబోయిన స్నేహిత అనే బాలిక కుటుంబానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి రూ.40 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండాల శ్రీనివాస్ యాదవ్, డా.ఎస్.బసివిరెడ్డి, సత్తిబాబు, నూకరాజు, బాలస్వామి, చిట్టి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ఆదాయం రూ.7.5 లక్షలు



డీఎం వీరస్వామి

మాచర్ల : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 13వ తేదీ నుంచి 20వ తేదీవరకు హైదరాబాద్, గుంటూరుకు ప్రత్యేకంగా సర్వీస్ బస్సులను ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ డిపోకు రూ.7,50,000 ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సాధారణ సర్వీసుల మాదిరిగానే అదనపు సర్వీసులు నడిపినట్లు తెలిపారు. దీంతో ఆదాయం కూడా వచ్చిందన్నారు. ఆర్టీసీ సేవలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

అనుగ్రహ పరిపూర్ణురాలు కానుకమాత



రెంటచింతల: పరిపూర్ణమైన హృదయంతో ప్రార్థించిన ప్రతి ఒక్కరిపై అనుగ్రహం కురిపించి వారాలిచ్చే తల్లి కానుకమాత అనుగ్రహ పరిపూర్ణురాలిగా కొనియాడబడుతుందని మాచర్ల విచారణ గురువులు రెవ.ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ వేడుకలలో భాగంగా ఫాదర్ రఫేల్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి నేతృత్వంలో కానుకమాత దేవాలయ ప్రాంగణంలో సహాయ గురువులు అగస్టీన్, రె.ఫాదర్ కె.నిఖిల్ తేజలతో కలిసి నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నవదిన ప్రార్థనలలో పాల్గొని దేవుని దీవెనలు పొందాలన్నారు. కతోలికులు ఏసు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సమిష్టి దివ్య పూజాబలిలో మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.